క్లుప్తంగా

ఫైలేరియా నివారణ మందులు పంపిణీ చేయాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మణి

బలిజిపేట: వచ్చేనెల 10వ తేదీన మండలంలోని అందరికీ ఫైలేరియా వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేయాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణి తెలిపారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీలో బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీలకు చెందిన సిబ్బందికి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫైలేరియా నివారణతో పాటు ముందస్తు జాగ్రత్తలకు గాను డీఈసీ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. అందరిచేత మాత్రలు వేయించి వ్యాధి వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా ఆప్తమాలజిస్ట్ రామచంద్రరావు, బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 31లోగా ఆస్తి పన్నులు చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు



పార్వతీపురంటౌన్: మార్చి 31లోగా ఆస్తి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పురపాలక సంఘానికి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు మొదలైనవి మార్చి 31 తేదీ వరకు బకాయి పడిన మొత్తాన్ని పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చెల్లించాలని కోరారు. లేనట్లయితే పురపాలక సంఘ చట్టం 1965 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు



వెంగాపురంలో పశువులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని వెంగాపురం, మిర్తివలస గ్రామాల్లో మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు సోమవారం నిర్వహించారు. అందులో భాగంగా 85పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, చూడి పరీక్షలు, 176పశువులకు వైద్యం, మందుల పంపిణీ చేయడం, 400మేకలకు మశూచి వ్యాధి నివారణకు టీకాలు వేశారు. 76లేగ దూడలు, 450పెద్ద పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 850 కోళ్లకు కొక్కెర తెగులు వ్యాధి సోకుండా టీకాలు రాత్రి సమయంలో ఇచ్చారు. ఇంకా ఏవైనా పశువులు మిగిలిపోతే సిబ్బంది వాటికి తగు పరీక్షలు చేపడతారని పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ అధికారులనే నియమించాలి



ఏపీఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: ఇటీవల పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో డీడీ విభాగంలో ఖాళీ అయిన సూపరింటెండెంట్ పోస్టులో ఆ విభాగంలో పనిచేసిన సీనియర్ ఉద్యోగిని అధికారిగా నియమించాలని గిరిజన సంఘాల నాయకులు పల్ల సురేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, రొబ్బ లవరాజు ఇంటికుప్పల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సహాయకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

- ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీనివాస్

పార్వతీపురం టౌన్: జిల్లాలో గల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో గల పార్వతీపురం మండలం చుక్కవానివలస అంగన్వాడీ కేంద్రంలోని సహాయకుల పోస్టు నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు, పార్వతీపురం ఒక యూనిట్‌గా పరిగణించి, షెడ్యూల్ ట్రైబల్ హ్యాబిటేషన్ గ్రామాలను అనుసరించి పోస్టులు భర్తీ అవుతున్నట్లు తెలిపారు. స్థానికంగా నివాసం ఉండి, షెడ్యూల్ ట్రైబల్ కులానికి చెందిన 10వ తరగతి ఉత్తీర్ణత పొంది, 2024 జూలై 1వ తేదీ నాటికి 21–35 మధ్య వయస్సు గల వివాహిత మహిళా అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దండిగాం బ్రిడ్జినిర్మాణం కలేనా..!

- గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు గ్రహణం
- ప్రారంభం కాని పనులు
- నిధులు వెనక్కు మళ్లించే ప్రయత్నం





బ్రిడ్జి నిర్మాంచాల్సిన దండిగాం వద్ద సువర్ణముఖి నది, (ఇన్‌సెట్లో) గత ప్రభుత్వంలో నిర్మాణం చేసిన కందుల పథం బ్రిడ్జి

సాలూరు రూరల్: మండలంలో గత ప్రభుత్వంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో పలు రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలకు భారీగా నిధులు మంజూరు చేయించారు. అయితే ఇందులో చాలావరకు రోడ్లు, బ్రిడ్జిల పనులు పూర్తయ్యాయి. అందులో శంబర రోడ్డు, కందులపథం బ్రిడ్జినిర్మాణం మండలానికే తలమానికంగా నిలిచాయి. అలాగే ఇంకా జరగాల్సిన పనులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పనులు నిలుపుదల చేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొత్త జీఓలతో పనులకు చెక్ పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలకు ఇటీవల కూటమి ప్రభుత్వ విడుదల చేసిన జీఓ బలం చేకూరుస్తోంది.

గత ప్రభుత్వంపై విమర్శలు

100 రోజులు 100 రోడ్లు పండగ అంటూ డబ్బా కొట్టుకుంటున్న కూటమి నాయకులు గత ప్రభుత్వంలో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టినప్పటికీ అసలు గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం విస్మరించిందటూ తప్పుడు ప్రచారం చేస్తూ గతంలో మంజూరైన లింకు రోడ్ల పనులు పక్కన పెట్టేందుకు ప్రయంత్నిస్తోందనడానికి ఉదాహరణగా దండిగాం వద్ద సువర్ణముఖి నదిపై బ్రిడ్జినిర్మాణానికి మంజూరైన రూ.9కోట్ల పనుల గురించి ఇంతవరకు స్థానిక మంత్రి ప్రస్తావించపోవడమే ఒక కారణంగా చెప్పవచ్చు. దండిగాం మీదుగా కురుకూటి, దళాయివలస తదితర గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల వరదలకు ఈ నదిలో ట్రాక్టర్‌తో పాటు అందులో ఉన్న 8 మంది త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వర్షాకాలంలో వరదల్లో ఈ నది దాటేందుకు చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు ఇబ్బందులకు గుర వుతున్నారు. ఇలాంటి బ్రిడ్జి నిర్మాణానికి మంజూరైన నిధులు వినియోగించకుండా వెనక్కు మళ్లించే ప్రయంత్న చేస్తున్న కూటమి ప్రభుత్వం తీరుపై స్థానిక గిరిజనులు మండిపడుతున్నారు. ప్రభుత్వం యుఒ నోట్‌ను విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో పనులు ప్రారంభం కానివి అలాగే 25 శాతం కన్నా పూర్తికాని పనులను నిలుపుదల చేస్తారు. ఇలాగే కానీ జరిగితే సాలూరు మండలంలో చాలావరకు గిరిజన గ్రామాలకు రోడ్లు, దండిగాం బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోయే పరిస్థితి నెలకొంటుంది.

ఆర్భాటం అలా.. ఆచరణ ఇలా..!



చినయాత వీధిజంక్షన్ వద్ద కాలువలో పేరుకుపోయిన చెత్తతో దర్శనమిస్తున్న మురుగునీరు

సాలూరు: ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు కొండంత..ఆచరణ గోరంత అన్న చందాన పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు ఉన్నాయని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని మంత్రి, అధికారులు పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాగా క్షేత్రస్థాయిలో మున్సిపాలిటీలో పారిశుధ్య లోపం అధికంగా కనిపిస్తోంది. పట్టణంలోని 28,29 వార్డులు తదితర ప్రాంతాల్లో కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల మురుగునీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో అవి దోమలకు ఆవాసాలుగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలువల్లో మురుగునీరు తీసి, పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి ఆదేశాలు జారీ చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో అచరణపై దృష్టిసారించాలని, లేకుంటే ఈ పారిశుధ్య లోపం వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురికాక తప్పదని వాపోతున్నారు. మరోవైపు బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న డంపింగ్ యార్డు చెత్త నుంచి వచ్చే విషవాయువుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక పరిసర ప్రాంతాల ప్రజలు అధికారులకు విన్నవించుకున్నప్పటి సంఘటనలు పాఠకులకు విదితమే. సాలూరు నుంచి పాచిపెంట వైపు వెళ్లే ప్రజలు సాలూరు శివారులో చేపలు, కోళ్లు, మాంసాల వ్యర్థాలు తదితర చెత్తను రోడ్డు పక్కనే పడవేస్తుండడంతో, అవి కుళ్లి వెలువడే దుర్గంధం వల్ల ముక్కు మూయకుండా వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది.

పారిశుధ్య కార్మికుల జీతాలు తక్షణమే చెల్లించాలి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు తదితరులు

సాలూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జీతాలు సక్రమంగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు హాజరయ్యేందుకు వచ్చిన స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ, జీతాలు సక్రమంగా అందించకపోవడం వల్ల పండగ వేళలోనూ కార్మికుల కుటుంబాలు పస్తులతోనే గడిపాయని వాపోయారు. ఈ సమస్యను 2024 నవంబరు 26న మంత్రిగా ఉన్న మీ దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పరిస్థితి మారలేదని నిట్టూర్చారు. 2024 డిసెంబరు నెల జీతం నేటికీ జమచేయలేదని పేర్కొన్నారు. డ్రైవర్లకు జీఓ 36 ప్రకారం అన్ని పట్టణాల్లో వేతనాలు ఇస్తున్నప్పటికీ సాలూరులో అమలుచేయడం లేదని తెలిపారు. పండగకు ఇవ్వాల్సిన చెప్పులు, నూనెలు, సబ్బులు తదితర సామగ్రి అన్ని మున్సిపాలిటీల్లో కార్మికులకు అందిస్తే ఇక్కడి కార్మికులకు ఇవ్వకుండా వారి సంక్షేమాన్ని మరిచారన్నారు. పై సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 5 తరువాత ఏ రోజైనా నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలియజేశారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం ఇవ్వగా సమస్యలు పరిష్కరిస్తామని, ప్రభుత్వంతో మాట్లాడి జీతాల చెల్లింపు సక్రమంగా జరిగేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

కన్నంపేట, పాపయ్యవలస గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు



పశువులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మక్కువ: మండలంలోని కన్నంపేట, పాపయ్యవలస గ్రామాల్లో సోమవారం పశుసంవర్థక శాఖ అధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశు ఆరోగ్య శిబిరాన్ని కన్నంపేట పంచాయతీ సర్పంచ్ బలగ సావిత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి కె.పోలందొర మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి, 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది, రెండు బందాలుగా ఏర్పడి షెడ్యూల్ ప్రకారం పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కన్నంపేట, పాపయ్యవలస గ్రామాల్లో 200 పశువులకు టీకాలు, 35 దూడలకు నులిపురుగు నివారణ మందులు, 42పశువులకు గర్భకోశ పరీక్షలు, 50 గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓల సమస్యలపై విద్యా శాఖ డైరెక్టర్‌కు వినతి

పార్వతీపురంటౌన్: మండల విద్యాశాఖాధికారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ్ రామరాజుకు వినతిపత్రం సమర్పించినట్లు ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ డైరెక్టర్ శ్రీకాకుళం విచ్చేసిన సందర్భంగా ఆయనను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరారు. హైస్కూల్ హెచ్ఎంలు, ఇతర గెజిటెడ్ అధికారులకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ ఉండగా మండలంలో దాదాపు 150 నుంచి 200 మంది టీచర్లకు డీడీవోలుగా ఉన్న ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడంతో చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరారు. ఎంఈఓలకు 2017 నుంచి ఇంతవరకు బదిలీలు నిర్వహించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, బదిలీలు నిర్వహించాలని, జీరో సర్వీస్‌తో బదిలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఆర్‌సీ కేంద్రాల భవనాల నిర్మాణం చేపట్టాలి

దశాబ్దాల కిందట నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రాల భవనాలు దాదాపు శిథిలావస్థలో ఉన్నాయని, చాలాచోట్ల ప్రమాదకర పరిస్థితుల్లో ఎంఈఓలు, కార్యాలయం సిబ్బంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విశాలమైన ఎంఆర్‌సీ కేంద్రాల భవనాలను నిర్మాణం చేయాలని తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తమ వినతిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 సంఘం నాయకులు ధనంజయ మజ్జి, జె నారాయణస్వామి, పి.జోగారావు, ఎస్.జోరాడు తదితరులు పాల్గొన్నారు

ఆడ పిల్లలను చదివిద్దాం..వారిని రక్షించుకుందాం

- వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేసిన మహిళా కమిషన్ సభ్యురాలు



వన్‌స్టాప్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ

పార్వతీపురంటౌన్: ఆడపిల్లలను చదివిద్దాం..వారిని రక్షించుకుందామని మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ అన్నారు. ఈ మేరకు సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను, జిల్లా ఆస్పత్రిని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సఖి వన్‌స్టాప్ సెంటర్‌కు వచ్చిన కేసుల వివరాలు, అత్యాచారానికి గురైన పిల్లలు, సఖి వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో నిర్వహిస్తున్న ఫైల్స్, రిజిస్టర్లు తదితర రికార్డులను స్వయంగా పరిశీలించారు. అనంతరం అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బందికి సేవలు అందజేయడంలో జాప్యం చేయరాదని, సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఆమె అత్యాచారానికి గురైన మహిళలు, పిల్లలు ఆస్పత్రికి వచ్చినప్పుడు చేయవలసిన పరీక్షలు సత్వరమే చేసి, మెరుగైన వైద్యాన్ని అందించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. ఈ పర్యటనలో ఆమెతో పాటు నోడల్ ఆఫీసర్, జిల్లా బాలల సంక్షేమ అధికారి సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, వన్‌స్టాప్ సెంటర్ స్టాఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలి



మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

సాలూరు: రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు జాతీయరహదారి భద్రత మాసోత్సవాల నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ప్రయాణికులకు రహదారి భద్రత నియమాలపై ప్లకార్డులతో అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదని, వాహనాల రికార్డులను తప్పకుండా కలిగి ఉండాలని తదితర రహదారి భద్రత నియమాలను వివరించారు. జాతీయరహదారి భద్రతా మాసోత్సవాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

118 పశువులకు వైద్యసేవలు



కొత్తవలసలో మాట్లాడుతున్న ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో 118 పశువులకు,1935 కోళ్లకు వైద్యసేవలు అందించినట్లు పశువైద్యాధికారులు, ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్, డాక్టర్ ఎస్.రామారావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రారంభించిన ఉచిత పశుఆరోగ్య శిబిరాల్లో భాగంగా సోమవారం మరిపివలస, గెడ్డలుప్పి, చిన్నారాయుడుపేట, కొత్తవలస, సూరంపేట గ్రామాల్లో ఉచితంగా పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 1935 కోళ్లకు వ్యాధినిరోధక మందులు వేశామని చెప్పారు. గ్రామీణ పశువైద్యాధికారులు, పారాస్టాఫ్ సహాయంతో 188 పశువులకు గర్భకోశ వైద్యపరీక్షలు, చూడి తనిఖీలు చేయడంతో పాటు చిన్న, పెద్ద పశువులకు నట్టలనివారణ మందులు వేశామని వివరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు


వినియోగిస్తే ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మక్కువ: ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మండల ఏఓ కె.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అధికంగా రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగం పెరిగిపోతోందని, విషపూరిత ఆహారం తినడంతో, నేల, నీరు, గాలి కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని దుగ్గేరు, కవిరిపల్లి గ్రామాల పరిధిలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ద్వారా ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో రైతులు సాగు చేసిన పంటలు నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులు వినియోగించి, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ కూరగాయలు స్టాల్ ఏర్పాటు చేయనున్నామని అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకువాలని కోరారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రకతి వ్యవసాయం సాగు ద్వారా పండించిన కూరగాయల స్టాల్స్‌ను ఎంఈఓలు పెంట సత్యనారాయణ, శ్యాంసుందర్ సందర్శించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఉర్లక నాగార్జున ఐసీఆర్పీలు అల్లు వెంకటరమణ, రెడ్డి సుందరరావు, దీసరి వెంకటరావు, చింతాడ లక్ష్మణ, వెలుగు కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వే పరిశీలన



కుష్ఠువ్యాధి సర్వేను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురంటౌన్: మండలంలోని ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి గ్రామాలను వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సోమవారం సందర్శించి హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు, లెప్రసీ సర్వేను తనిఖీ చేశారు. కుష్ఠువ్యాధి లక్షణాలు గుర్తించడం కోసం సర్వే చేపడుతున్న తీరుపై ఏమేరకు సర్వే పూర్తి చేశారో వివరాలు తెలుసుకున్నారు. అనుమానిత లక్షణాలతో ఎవరినైనా గుర్తించారా? అని ఆరా తీసి సర్వే పూర్తి చేసిన ఇంటికి మార్కింగ్ విధానాన్ని గమనించారు. ప్రతి ఇంటిలో ఉన్న కుటుంబసభ్యులు అందరినీ క్షుణ్ణంగా పరీక్షించాలని చెప్పారు. లక్షణాలను త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. కుష్ఠు వ్యాధిని గుర్తించే లక్షణాల కరపత్రికలను ప్రజలకు అందజేసి అవగాహన కల్పించాలని కోరారు. అక్కడి స్థానికులతో ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్ మాట్లాడి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్తిబాబు, జయలక్ష్మి, వైద్యసిబ్బంది పద్మావతి, కమల కుమారి, నందిని, పోలమ్మ, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూఓలు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వే సిబ్బందికి సహకరించాలి

సీతానగరం: మండలంలో కుష్ఠువ్యాధి సర్వే చేయడానికి ఇంటింటికీ వస్తున్న వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లు పి.ఉష, పి.పావని కోరారు. పలుగ్రామాల్లో కుష్ఠువ్యాధి లక్షణాలను గుర్తించడానికి వైద్యసిబ్బంది చేస్తున్న సర్వేను సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయస్థాయిలో కుష్ఠువ్యాధి రహిత సమాజస్థాపనే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతుందని చెప్పారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలమేరకు మండలంలోఇ జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీవరకూ వైద్యసిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు తెల్లని మచ్చలు, శరీరంపై తిమ్మిర్లు, తదితర పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ విషయమై ప్రజలు సహకరించాలని కోరారు.

కుష్ఠువ్యాధి సర్వే

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో కుష్ఠువ్యాధి సర్వేను బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సర్వేను వచ్చేనెల 2వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. సర్వే సమయంలో అనుమానిత కేసులను గుర్తించి వాటిని నిర్ధారణ చేసిన అనంతరం తగిన విధంగా వైద్యసేవలు అందించనున్నామన్నారు. దీనిపై పీహెచ్‌సీలో ఆశవర్కర్లు, సిబ్బందికి అవగాహన నిర్వహించి వ్యాధి గుర్తింపు ఏ విధంగా చేయాలో వివరించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి అనుమానిత కేసులను తెలియపరచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ కర్ణ, పీహెచ్ఎన్ చంద్రావతి, హెచ్‌వీ నాని, ఉమ పాల్గొన్నారు.



బలిజిపేటలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి



చినభోగిలిలో శరీరంపై స్పర్శను పరిశీలిస్తున్న సిబ్బంది

కోతకు గురైన కాజ్‌వే



విజయరామపురం గ్రామం వద్ద కోతకు గురైన కాజ్‌వే

మక్కువ: మండలంలోని దబ్బగెడ్డ పంచాయతీ విజయరామపురం గ్రామం సమీపంలోని కొండగెడ్డపై ఉన్న కాజ్‌వే కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఈ కాజ్‌వేపై నుంచి నిత్యం పలు వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. గ్రామానికి చెందిన గిరిజనులు కొండగెడ్డలో స్నానాలు, దుస్తులు శుభ్రంచేయడం వంటివి చేస్తుంటారు. అంతేకాకుండా పక్కనే పాఠశాల ఉంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు గెడ్డ సమీపానికి రావాల్సి ఉంది. అటువంటి పరిస్థితిలో ఆదమరిస్తే కోతకు గురైన కాజ్‌వేలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కాజ్‌వే కోతకు గురై సుమారు ఆరునెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు అయినా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యపనులు



సూరంపేట ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లో తీస్తున్న సిల్ట్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్యపనులు వేగవంతం చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు సూరంపేట పంచాయతీలో సర్పంచ్ అప్పన్నమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మురళి చేయిస్తున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయడంతో పాటు వాటర్ ట్యాంకుల్లో సిల్ట్‌తీసే పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగు నీరు సరఫరా చేయాలని కోరారు. ఇంటింటి కుళాయిల వద్ద చెత్త నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.